క్లుప్తంగా

శుభకార్యం

కూడేరు: మండలంలోని జల్లిపల్లికి చెందిన సచివాలయాల మండల కన్వీనర్ కురుబ దేవేంద్ర సోదరుడి కుమారుడు సురేష్ వివాహం శృతితో గురువారం కూడేరులోని జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే బళ్లారిలో జరిగిన జల్లిపల్లి వైఎస్సార్‌సీపీ నేత మంగళ శ్రీరాములు కుమార్తె వివాహానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్నోబిలంలో పూజలు



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో జరగబోయే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులందరూ అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కోరుకున్నానన్నారు. కార్యక్రమంలో ఈఓ కె. విజయ్‌కుమార్, ప్రధాన అర్చకుడు ద్వారకానాథాచార్యులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

ఉరవకొండ రూరల్: ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక సెబ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన వరుణ్‌కుమార్‌తో ఉపాధ్యాయులు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వరుణ్‌కుమార్ అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఇటీవల చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. వరుణ్‌కుమార్‌ను పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సర్వమంగళం, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

బ్రహ్మసముద్రం: మండలంలోని కపటలింగనపల్లిలో అప్పులబాధ తాళలేక రైతు కాపు రాజన్న (42) ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు ఎకరాల్లో వేరుశనగ, ఉల్లి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తూ నష్టపోయాడు. రూ.4 లక్షలు పైగా అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీరే మార్గం కానరాక బుధవారం అర్ధరాత్రి గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని బళ్లారి ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం చికిత్సపొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య రాధమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేడు తిప్పేరుద్రస్వామి రథోత్సవం

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎరడికెర గ్రామంలో శుక్రవారం గురుతిప్పేరుద్రస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. భక్తులు హాజరు కావాలని వారు కోరారు.

ఘనంగా పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: స్థానిక షిరిడీసాయి ఆలయంలో గురువారం పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి క్షీరాభిషేకం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు అనంతస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేరుశనగకు మొవ్వకుళ్లు

కుందుర్పి: మండలంలోని రబీ వేరుశనగ పంటకు మొవ్వకుళ్లు సోకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోత దశకు వచ్చి వేరుశనగ పంట దెబ్బతినడంతో రైతులు ఎకరాకు రూ.30 వేల దాకా నష్టపోయారు. నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేయగా మొవ్వకుళ్లతో మొత్తం దెబ్బతినడంతో పశువులకు వదిలేసినట్లు కెంచంపల్లి రైతులు కృష్ణమూర్తి, నాగప్ప వాపోయారు. పెట్టుబడి కూడా దక్కక తీవ్రంగా నష్టపోయామని రైతులు రాజప్ప, హరికృష్ణ, గోవర్ధన, సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఏరియా ఆస్పత్రిలో కోల్డ్‌వార్..!

- ఒకరిపై మరొకరు దూషణల పర్వం
- డీసీహెచ్‌ఎస్ వద్దకు పంచాయితీ
- సమగ్ర విచారణకు ఆదేశం



రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

రాయదుర్గం: స్థానిక ఏరియా ఆస్పత్రిలోని నర్సింగ్ విభాగం సిబ్బంది మధ్య కోల్డ్‌వార్ నెలకొంది. సెలవులు, విధులు, డేఆఫ్ కేటాయింపుల్లో ఏర్పడ్డ వివాదం ముదిరి రచ్చకెక్కింది. సర్దుకుపోవాల్సిన చోట ఆధిపత్యానికెళ్లి ఒకరిపై మరొకరు దూషణల పర్వం కొనసాగించే స్థితికి చేరింది. నర్సింగ్ సూపరింటెండెంట్ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఒక వర్గానికే మద్దతు పలుకుతున్నారంటూ.. కొందరు ఆమె పట్ల కూడా దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇంతటితో ఆగకుండా ఓ ఉద్యోగి ఆస్పత్రిలో జరిగిన పరిణామాలను కలెక్టర్‌తో పాటూ డీసీహెచ్‌ఎస్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా ధర్మవరం ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కొందరు ఉద్యోగులను విచారణ నిమిత్తం ఇటీవల రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి పంపారు. నర్సింగ్ సూపరింటెండెంట్ తో పాటు హెడ్‌నర్సులు, ఇతర సిబ్బందిని విడివిగా విచారించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిన విషయం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. వివిధ పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారికీ మెమోలు జారీ చేశారు.

ఆస్పత్రిలో ఇష్టారాజ్యం..!

ఆస్పత్రిలో కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏఏ వార్డుల్లో ఎవరెవరూ ఆ రోజు విధుల్లో ఉంటారనే విషయం రోగులకు స్పష్టంగా తెలిసేలా ప్రభుత్వం బోర్డింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ప్రధాన వార్డుల్లో ఏర్పాటు చేసిన బోర్డుల్లో డాక్టర్, సిబ్బంది పేర్లు, పక్కనే వారి ఫోన్ నెంబర్లు కనబరుస్తారు. అయితే ఇక్కడ మాత్రం పేర్లు కరెక్టు చూపినా ఫోన్ నెంబర్లు మాత్రం తప్పులు తడకగా పెట్టి రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని గుర్తించిన అధికారులు మెమోలు జారీచేసి సరిచేసేలా చర్యలు చేపట్టారు. మూడు రోజుల కిత్రం ఎఫ్‌ఎన్‌ఓ చేయాల్సిన డ్యూటీని సెక్యూరిటీ గార్డు నిర్వహించాల్సి వచ్చింది. ఇది కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొందరి నిర్లక్ష్యం వల్ల అత్యాధునిక సౌకర్యాలు అందజేస్తున్న ప్రభుత్వానికి మచ్చతెచ్చేలా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ పెంచి ప్రజలకు నాణ్యమైన సేవలందేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

విచారణ చేసిన మాట వాస్తవమే



సిబ్బంది మధ్య కోల్డ్‌వార్‌పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓ కమిటీ ఇటీవల విచారణ చేపట్టింది. చిన్న కారణాలకు గొడవలు పడి రచ్చకీడ్చారు. ఆస్పత్రిలో ఇష్టారాజ్యంగా విధులు నిర్వహించే వారి పట్ల నిఘా ఉంచాం. కఠిన చర్యలు చేపడతాం. కొన్ని పొరపాట్లు మినహా రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యం, సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– మాధవి, ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం

'బాబు'వి దిగజారుడు రాజకీయాలు



మాట్లాడుతున్న విప్ కాపు. చిత్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబువన్నీ దిగజారుడు రాజకీయాలేనని, సీఎం కుర్చీ కోసం పిల్లనిచ్చిన సొంత మామ (ఎన్టీఆర్)నే వెన్నుపోటు పొడిచి గద్దెనెక్కిన దౌర్భాగ్యుడని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆరోపించారు. పట్టణంలోని సీతారామ కల్యాణ మంటపంలో గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ బోయ నిఖిత, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ మంజుల , మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డితో కలసి విప్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2019 ఎన్నికల్లోనే టీడీపీ శకం ముగిసిపోయిందన్నారు. ఆ తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ ప్రజలు చావుదెబ్బతీశారన్నారు. పార్టీని బతికించుకునేందుకు తండ్రీ, కొడుకులు మళ్లీ వీధినాటకాలకు తెరతీశారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను మేధావులంతా ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దామన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ అధికారం కోసం గతంలో చంద్రబాబు 600 అపద్ధపు హామీలిచ్చాడని ధ్వజమెత్తారు. పైలా మాట్లాడుతూ దేశం గర్వించేలా సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు తెస్తాం.. సచివాలయాలు తీసేస్తాం, వలంటీర్లను పీకేస్తాం..? అంటున్న టీడీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, పట్టణ కన్వీనర్ ముస్తాక్, పార్టీ ముఖ్య నాయకుడు పొరాళ్ల శివ, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, మాజీ ఎంపీపీ ఆలేరు రాజగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



రాయదుర్గంటౌన్: ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిలర్లు



వజ్రకరూరు: గడేహోతురులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



విడపనకల్లు: ఎంపీడీఓను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రాయదుర్గం/రాయదుర్గంటౌన్/బొమ్మనహాళ్/బ్రహ్మసముద్రం/కుందుర్పి/ఉరవకొండ/కూడేరు/బెళుగుప్ప/వజ్రకరూరు/విడపనకల్లు: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల వ్యాప్తంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు చేపట్టిన ప్రచారం గురువారం ఊపందుకుంది. టీడీపీ నాయకులు చెప్పే కల్లిబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. రాయదుర్గం పట్టణంలో మున్సిపల్ చైర్మన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు ప్రచారంలో పాల్గొనగా, గుమ్మఘట్ట, డి హీరేహాళ్, బొమ్మనహాళ్, రాయదుర్గం మండలాల్లో పార్టీ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు ప్రచారం చేశారు.

- గుమ్మఘట్ట మండలంలోని సిరిగెదొడ్డి గ్రామంలో సర్పంచ్ రమేష్, గలగల గ్రామంలో సర్పంచ్ హేమక్క, ఎంపీటీసీ పరమేశ్వర్, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, నాయకులు గలగల సిద్దప్ప, పైదొడ్డి ఈరన్న , గోవిందు తదితరులు ప్రచారం నిర్వహించారు.
- బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు, కల్‌హోళ తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సర్పంచ్‌లు వీరన్నగౌడ్, ముక్కన్న, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బసప్ప, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.
- బ్రహ్మసముద్రం మండలంలోని పోలేపల్లి గుండిగానీపల్లి, ముద్దలాపురం తదితర గ్రామాల్లో చేపట్టిన ప్రచారంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ బసవరాజు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కుందుర్పి మండలంలోని తూముకుంట, బెస్తరపల్లి, తెనగల్లు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, ఎంపీపీ కమలమ్మ, సచివాలయ మండల కన్వీనర్ ఈ.రాము, సర్పంచులు అతావుల్లా, గంగాధర, వరలక్ష్మి, నాయకులు లింగప్ప, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.
- ఉరవకొండ పట్టణంలో నిర్వహించిన ప్రచారంలో జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబుళేసు, వాణి విద్యాసంస్థల ప్రతినిధి రఘురాములు, వార్డు సభ్యులు వశికేరిమల్లి, వడ్డే ఆంజినేయులు, కాసుల ఆంజి తదితరులు పాల్గొన్నారు.
- కూడేరు మండలంలోని ఉదిరిపికొండలో నిర్వహించిన ప్రచారంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, నాయకులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, క్రిష్టప్ప, సిద్ధారెడ్డి, రామ్మోహన్, నరేష్, లక్ష్మన్న యాదవ్, రామన్న తదితరులు పాల్గొన్నారు.
- బెళుగుప్ప మండలంలో నిర్వహించిన ప్రచారంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, బెళుగుప్ప సింగల్‌విండో అధ్యక్షుడు శివలింగప్ప, ఆవులన్న సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు త్రిలోక్‌రెడ్డి, మారుతి, మారుతిరెడ్డి, వెంకటరెడ్డి, తిమ్మారెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.
- వజ్రకరూరు మండలంలో నిర్వహించిన ప్రచారంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఉస్మాన్, మండల కార్యదర్శి నల్లబోతులరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మాజీ ఎం పీపీ తిప్పయ్య, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు
- విడపనకల్లు మండలంలో నిర్వహించిన ప్రచారంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మండల కన్వీనర్ బసన్న, ఎంపీపీ కరణం పుష్పావతి, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, జెడ్పీటీసీ హనుమంతు, మార్కెట్ యార్డు డైరెక్టర్ కురుబ రమేష్, కోఆప్షన్ మెంబర్ లతీఫ్, రాజు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి సీఎం కృషి



రాయదుర్గం: మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నిఖిత

రాయదుర్గం/కళ్యాణదుర్గం: ప్రాథమిక సహకార సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ నిఖిత అన్నారు. గురువారం రాయదుర్గం ఏడీసీసీ బ్యాంకును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మేనేజర్ ఫణీంద్ర తో బ్యాంకు లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు. ఖాతా దారుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గంలోని ఏడీసీసీ బ్యాంక్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ హనుమంతరాయుడు, సూపర్‌వైజర్ పవన్‌కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కళ్యాణదుర్గం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. నియోజకవర్గంలోని రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఏఎఫ్ ఎకాలజీ కేంద్రం నుంచి టీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు గౌతమి, పద్మావతి, హేమలత, గ్రామీణా బ్యాంక్ మేనేజర్ జ్యోతి , లాయర్ ప్రవీణకుమారి, చల్లా కిశోర్, ఎకాలజీ సీఈఓ మురళీకృష్ణ , సీబీఓ కోఆర్డినేటర్ భాస్కర్ బాబు, ఏఎల్ పీ కోఆర్డినేటర్ రిజ్వానా, రుద్రయ్య, బ్రహ్మేశ్వరరావు, వీరభద్ర రెడ్డి, శివశంకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి తేజశ్వినిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాబావలి, ఎంఎల్‌హెచ్‌పీలు శ్రావణి, లక్ష్మి, ఏఎన్‌ఎం మౌనిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓంశాంతి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో గురువారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహింరు. సంచాలకురాలు బీకే యోగీశ్వర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ మహిళలు విద్యావంతులై దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు.

ప్రవక్త మార్గంతో జీవితానికి సార్థకత



సామూహిక ప్రార్థన చేస్తున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: ప్రవక్త మొహమ్మద్ (సొఅస) మార్గంలో నడిస్తేనే ప్రతి ముస్లిం జీవితానికి సార్థకత లభిస్తుందని ధార్మిక గురువులు మౌలానాలు మంజూర్‌సాబ్, అల్తాఫ్‌భాయ్(ఢిల్లీ) సూచించారు. పట్టణంలోని బళ్లారి రోడ్డు వద్ద ఉన్న నేషనల్ ఫంక్షన్ హాల్ పక్కన రెండురోజుల పాటు జరిగే ముస్లిం ధార్మిక సదస్సు(ఇజ్తెమా) గురువారం ప్రారంభించారు. అసర్ నమాజ్ నుంచి భారీ సంఖ్యలో ఇజ్తెమాకు ముస్లింలు చేరుకున్నారు. రాయదుర్గం డివిజన్‌లోని పరిసర ప్రాంతాలతోపాటు కర్ణాటకలోని హొస్పేట్, కొప్పళ్, బళ్లారి నుంచి తరలివచ్చి సదస్సులో పాల్గొన్నారు. సామూహిక ప్రార్థనల అనంతరం మౌలానాలు మాట్లాడుతూ ప్రవక్త సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. పేదవాడి ఆకలి తీర్చడమే ఇస్లాం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సాటి మనిషి ఆపదలో ఉంటే ఆదుకోవాలన్నారు. ఐదు పూటల నమాజ్, రంజాన్ రోజాలు, ఆర్థిక స్తోమత గల వారు హజ్ యాత్ర చేయాలన్నారు.

సర్మస్ హుసేన్సీ స్వామి దర్గాలో ఫాతేహాలు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణంలో కందూరీలు చేశారు.

హుండీ కానుకల లెక్కింపు



ఉరవకొండ: స్థానిక గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో లెక్కించగా రూ.88,275 ఆదాయం సమకూరింది. ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు సహాయ కమిషనర్ తెలిపారు. మఠం సిబ్బంది శంకర్, నారాయణ స్వామి, గోపి, మధు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల ధ్వంసం

గుమ్మఘట్ట: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో 21 కేసుల్లో పట్టుబడిన 3 999 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ సునీత గురువారం తెలిపారు. ఎస్పీ ఉత్తర్వుల మేరకు సెబ్ సీఐ శ్రీనివాసులు, రూరల్ సీఐ యుగంధర్ సమక్షంలో బీటీపీ డ్యాం ప్రదేశంలో రూ.1,44,252 విలువ చేసే మద్యం టెట్రా ప్యాకెట్లను జేసీబీతో ధ్వంసం చేశామన్నారు.

సకాలంలో రేషన్ అందేలా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ చందాచంద్రమ్మ

ఉరవకొండ: పట్టణంలో చాలా వార్డుల్లో రేషన్ బియ్యం పూర్తి స్థాయిలో పంపిణీ చేయడం లేదని, పేదలకు బియ్యం, బ్యాళ్లు, చక్కెర వంటివి ప్రభుత్వం నిర్దేశించిన ధరకు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్, సీఎస్‌డీటీ రమేష్‌బాబును ఎంపీపీ చందాచంద్రమ్మ, కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం, ఎంపీటీసీ వన్నూర్‌సాబ్ తదితరులు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. రేషన్ బియ్యం ప్రజలకు సక్రమంగా అందించాలని మెజార్టీ సభ్యులు తహసీల్దార్, సీఎస్‌డీటీలను కోరారు. అలాగే రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదాకు సభ్యులు సూచించారు. జేజేఎం కింద పనులను మరింత వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారి గత రెండు సమావేశాలకు గైర్హాజరు కావడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సమావేశం తీర్మానించింది. జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎంపీడీఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కాలవా.. నోరు జాగ్రత్త

రాయదుర్గం: కాలవా..? నోరు జాగ్రత్త.. అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుంది.. ఎస్సీ, ఎస్టీ లంటే నీకు అంత చులకనగా ఉందా అంటూ రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజునాయక్ తీవ్రస్థాయిలో విరుచుపడ్డాడు. సీతాటాకు చప్పుళ్లకు ఇక్కడ భయపడేవాడు ఎవడూ లేడని ఘాటుగా స్పందించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిపై నిత్యం అసభ్యకర పోస్టింగులు పెట్టే వ్యక్తికి వత్తాసు పలుకుతావా..? అంటూ నిలదీశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నానా హంగామా సృష్టిస్తూ మాపై కేసులు నమోదు చేయాలంటూ నోరుపారేసుకుంటావా..? నీకన్నా వెధవలు మరెవరైనా ఉన్నారా అంటూ నిలదీశారు. డ్రామా ఆర్టిస్టుల్లా వేషాలు వేసుకుని నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. రాజకీయాల్లో కీలక పదవి అనుభవించిన నీవు ఇదేనా నేర్చుకుందని ప్రశ్నించారు. ఓ గిరిజన కులానికి చెందిన వ్యక్తిని వెధవ అంటూ హేళనగా మాట్లాడే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు.

'నాపై కుట్రలు పన్నారు'

కణేకల్లు: నాపై కక్ష సాధించేందుకు కొందరు కుట్రలు పన్ని అర్చక విధుల నుంచి తొలగించాలని చూస్తున్నారని చిక్కణ్ణేశ్వర స్వామి ఆలయ పూజారి బసవరాజుశాస్త్రి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయ ఆవరణలో తల్లి పుష్పావతితో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాకు అక్రమ సంబంధాలున్నాయని ఆరోపిస్తూ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని విధుల నుంచి తప్పించాలని చూడటం సరైన పద్ధతి కాదన్నారు. నాపై చేసిన ఆరోపణలకు రుజువులు చూపిస్తే ఎలాంటి శిక్షనైనా అనుభవిస్తానని, విధుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకుంటానన్నారు. రుజువులు చూపించడానికి రెండ్రోజుల గడివిస్తున్నాన్నారు. చూపించకపోతే ఆదివారం నుంచి అర్చక విధులు నిర్వహిస్తానన్నారు.

ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ మోసం



పాదయాత్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కంబదూరు: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు అండగా నిలబడుతామని 2014 ఎన్నికల్లో మాట ఇచ్చిన బీజేపీ.. తొమ్మిదేళ్లు అవుతున్నా ఎస్సీ వర్గీకరణ ఊసెత్తకుండా మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాదిగల సంగ్రామ పాదయాత్ర చేపట్టారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు తిరుపాల్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు సమావేశంలో ఎస్సీ వర్గీకరణ విషయంపై బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించకపోతే బీజేపీ ప్రభుత్వంపై మాదిగలు మరో పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ 4న రాష్ట్ర రాజధాని విజయవాడలో రహదారుల దిగ్బంధం చేస్తామని, అలాగే బీజేపీ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాల్మీకి సేవా సమితి తాలూకా అధ్యక్షుడు గోవిందు, నిజవల్లి బాబు, కంబదూరు మండల అధ్యక్షుడు గంపల రామాంజి, ఎమ్మార్పీఎస్ నాయకులు భీమలింగప్ప, నరసింహులు, జయప్రకాష్, సాకే గురుమూర్తి, యాటకల్లు రాము, నాగార్జున, శివ, వాసు, అనీల్, శంకర్, అండేపల్లి హరి, మారుతి, గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. నలుగురికి గాయాలు

విడపనకల్లు: ఉరవకొండ సమీపంలో ఉన్న చెక్ పోస్టు వద్ద గురువారం ట్రాక్టర్ బోల్తా పడి నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని వేల్పుమడుగు గ్రామానికి చెందిన కురుబ నారాయణస్వామి ఆమిద్యాల గ్రామం నుంచి వేరుశనగ పొట్టును ట్రాక్టర్‌లో వేసుకువస్తుండగా.. 42వ జాతీయ రహదారిలో లారీని ఓవర్ టేక్ చేయబోయి చెక్ పోస్టు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న బెస్త నారాయణస్వామి, బోయ నారాయణప్ప, సుధాకర్‌తో పాటు కురుబ నారాయణస్వామి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

వ్యక్తి ఆత్మహత్య

కంబదూరు: పిల్లలు కలగలేదన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తిమ్మాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన మల్లికార్జున (50) అనే వ్యక్తికి శకుంతలమ్మ, రాధిక అనే ఇద్దరు భార్యలు. అయితే ఇద్దరికీ పిల్లలు కావడంతో మనస్తాపం చెంది గురువారం పొలంలోని షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.